నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, సోమవారం 21 అక్టోబర్ 2024 RANGAREDDY



షాబాద్‌లో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

## పవర్‌లోకి రాగానే మాట మార్చారు..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేసి.. ఆ భూములను రైతులకు ఇప్పిస్తామని అసెంబ్లీ ఎన్నికలప్పుడు కల్లబొల్లి మాటలు చెప్పిన కాంగ్రెస్ నాయకులు కోదండరెడ్డి, ప్రస్తుత మంత్రులు భట్టి విక్రమార్క, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పవర్‌లోకి రాగానే మాటమార్చారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఫార్మాసిటీ ఏర్పాటుకు బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుడితే... నేడు అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కారు ఆ ప్రాంతంలో నాలుగు రకాల పేర్లుపెట్టి ఇష్టానుసారంగా దండుకుంటున్నది. ఈ విషయంపై ఫార్మాసిటీ ప్రాంత రైతులు కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి. ప్రస్తుత సర్కారు మాటలకే సరి పోయింది. చేతల్లో ఏమీ లేదు. ఫార్మాసిటీని రద్దు చేస్తున్నామని చెప్పినందున వెంటనే దానిని రద్దు చేసి.. ఆ భూములను తిరిగి రైతులకు ఇవ్వాలి.

– సబితాఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే

# రైతుల కోసం.. గులాబీ జంగ్ సైరన్

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు, రైతుల ధర్నాలు, రాస్తారోకోలు

**'రైతుభరోసా' ఇవ్వాల్సిందేనని నేతలు, రైతుల డిమాండ్**

- వానకాలం పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టిందని కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం
- రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు, రాస్తారోకోలు
- షాద్‌నగర్‌లో జరిగిన ధర్నాలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- ఇబ్రహీంపట్నంలోని బొంగుళూరు వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- బొంరాస్‌పేట మండలంలోని తుంకిమెట్ల, పరిగి బస్టాండ్ వద్ద జరిగిన రైతుధర్నాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, కొప్పుల మహేశ్‌రెడ్డి

*అదిగో.. ఇదిగో అంటూ ఆశజూపి వానకాలానికి సంబంధించిన రైతు భరోసాను ఎగ్గొట్టి రైతులను కుదేలు చేసిన రైతన్నకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచింది. కష్టకాలంలో మేమున్నామంటూ..ఆదివారం రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని అన్ని మండల కేంద్రాల్లో రైతులతో కలిసి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించింది. షాద్‌నగర్‌లో నిర్వహించిన ధర్నాలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని బొంగుళూరు వద్ద జరిగిన ధర్నాలో బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పాల్గొని ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. షాబాద్ మండల కేంద్రంలోని ముంబయి-బెంగళూరు లింకు జాతీయ రహదారిపై షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుధర్నాలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా వికారాబాద్ జిల్లా, బొంరాస్‌పేట మండలంలోని తుంకిమెట్లలో జరిగిన ధర్నాలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, పరిగి బస్టాండ్ వద్ద జరిగిన రైతుధర్నాలో పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పాల్గొని సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్ నాయకులు రైతన్నలతో కలిసి కదం తొక్కారు. నినాదాలతో ధర్నా ప్రాంగణాలు దద్దరిల్లాయి. ఇప్పటికైనా రైతు భరోసా ఇచ్చి తీరాల్సిందేనని, ప్రభుత్వం మెడలు వంచే వరకు పోరు ఆగదని నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆందోళన చేసిన బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. అన్ని చోట్లా ధర్నాలు, రాస్తారోకోలు సూపర్ సక్సెస్ కావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ కనిపించింది.*

*-రంగారెడ్డి, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ)*

### కేసీఆర్ పాలనను గుర్తు చేసుకున్న రైతులు..

రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని ఎన్నికలకు ముందు చెప్పి ఆ తర్వాత మొండిచేయి చూపిన కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరసన కార్యక్రమాల్లో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రతి సీజన్‌కు ఠంచన్‌గా ఇచ్చిన రైతుబంధును రైతులు గుర్తు తెచ్చుకున్నారు. రైతులు పంటల సాగుకు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కేసీఆర్ ప్రభుత్వం వానకాలం, యాసంగి సీజన్లకు ముందుగానే రైతుబంధు సాయాన్ని అందిస్తూ వచ్చిందని రైతాంగం కొనియాడింది. 2018 వానకాలం సాగు నుంచి ఏటా రూ.8వేల సాయం అందించగా.. 2019 వానకాలం నుంచి ఆ సాయాన్ని కేసీఆర్ రూ.10వేలకు పెంచారు. కరోనా వంటి సంక్షోభ పరిస్థితుల్లోనూ పెట్టుబడి సాయాన్ని ఆపలేదు. రైతన్నలకు ఆత్మబంధువుగా నిలిచిన రైతుబంధు పథకంలో రంగారెడ్డి జిల్లాలోని రైతాంగానికి 11 విడతలుగా గతేడాది వానకాలం వరకు రూ.3,337 కోట్లను నిరాటంకంగా అందించారు. కేసీఆర్ హయాంలో ప్రతి సీజన్‌కు ముందుగానే రైతుబంధు సాయం అందగా.. కాంగ్రెస్ హయాంలో వానకాలం ముగిసినా రైతుల ఖాతాల్లో నయా పైసా జమకాక పోవడంపై రైతాంగం ఆందోళన వ్యక్తం చేసింది. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతామని రైతులు హెచ్చరించారు.

### ఇచ్చే దాకా కొట్లాడుడే..

రైతు భరోసా లేక గుండె చెదిరిన అన్నదాతకు బాసటగా నిలవాలని సంకల్పించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రతి మండలంలోనూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునివ్వగా.. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో బీఆర్ఎస్ శ్రేణులు రైతులతో కలిసి ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు. ప్రభుత్వ, సీఎం దిష్టిబొమ్మలను దహనం చేసి, ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. కాగా నిరసన కార్యక్రమాల్లో యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులతో పాటు ఉమ్మడి జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిగొచ్చి వానకాలం రైతు భరోసాను ఇచ్చేవరకూ నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని , అప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వంతో కొట్లాడుడేనని స్పష్టం చేశారు. గ్రామ స్థాయిలోనూ ఉద్యమ కార్యాచరణను అమలు చేస్తామని పేర్కొన్నారు.


4లో..



పరిగిలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేసి నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు



ఆదిబట్లలో జరిగిన దసరా సమ్మేళనంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితారెడ్డి

# రేవంత్.. చెప్పేవన్నీ.. దొంగ మాటలే..

ఫార్మాసిటీ ఏర్పాటుపై కోర్టునూ తప్పుదోవ పట్టిస్తున్న సీఎం

దమ్ముంటే ఫార్మాసిటీని కట్టు..లేదంటే భూములను రైతులకు ఇచ్చెయ్

గల్లీ, గల్లీ తిరిగి ముఖ్యమంత్రి మోసాలను ప్రజలకు వివరిస్తాం

అన్నదాతలకు బీఆర్ఎస్ అండ

ఫార్మా రైతులనే కాదు అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసింది

**ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ కార్యకర్తల దసరా సమ్మేళనంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

రంగారెడ్డి, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ)/ఇబ్రహీంపట్నం రూరల్ : ఫార్మాసిటీపై రేవంత్‌రెడ్డి చెప్పేవన్నీ దొంగ మాటలేనని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల దసరా సమ్మేళనం ఆదివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్రమీద గార్డెన్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర యువజన నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగింది. దీనికి మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ..ఫార్మాసిటీ ఉందని ఒకసారి, లేదని మరోసారి చెబు తూ రేవంత్‌రెడ్డి కోర్టును కూడా తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. నాలుగు ఇంచుల భూమినీ సేకరించని ముఖ్యమంత్రి ఫోర్త్‌సిటీని ఎలా నిర్మిస్తారని ఎద్దేవా చేశారు. గ్రీన్‌సిటీ, ఫార్మాసిటీ కోసం కేసీఆర్ ఎనిమిదేండ్లు కష్టపడ్డారని, రైతులను ఒప్పించి, మెప్పించి 14,000 ఎకరాలను సేకరించామని గుర్తు చేశారు. దమ్ముంటే ఫార్మాసిటీని కట్టు.. లేకుంటే ఆ భూములను రైతులకు ఇచ్చేయాలని సూచించారు. ఎన్నికలకు ముందు ఓ మాట, తర్వాత మరోమాట చెప్పి రేవంత్‌రెడ్డి చేస్తున్న మో సంపై ప్రజాక్షేత్రంలో పోరాటం చేస్తామని.. గల్లీ గల్లీ తిరిగి ప్రజలకు వివరిస్తామన్నారు. ఫార్మా రైతులనే కాదు అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. గ్రామగ్రామాన మనమే కథానాయకులుగా మారాలని కార్యకర్తలకు ఈ సందర్భంగా కేటీఆర్ పిలుపునిచ్చారు.

### రైతు భరోసాకు రాంరాం..

మూడు పంటలకు పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పడంతోపాటు కేసీఆర్ ముష్టి రూ.10 వేలు ఇస్తున్నారని..తాము అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.15 వేల చొ ప్పున ఇస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారని కేటీఆర్ మండిప డ్డారు. ఖరీఫ్ రైతు భరోసా ఎగ్గొడుతున్నామని సిగ్గులేకుండా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల చావు కబురు చల్లగా చెప్పారని ఎద్దేవా చేశారు. రైతుల తరపున బీఆర్ఎస్ ఎప్పటి నుంచో పోరాటం చేస్తున్నదని.. కానీ, ఇతర రైతు సంఘాల నోళ్లు ఎందుకు మూగబోయాయని కేటీఆర్ ప్రశ్నించారు. రైతుల తరపున మాట్లాడాల్సిన కమ్యూనిస్టులు ఎక్కడికి పోయారన్నారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల సందర్భంగా సాక్షాత్తూ రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని, పిల్లల ఉద్యోగాల సంగతేమోగానీ..రాహుల్‌గాంధీకి ప్రతిపక్ష నేతగా, రేవంత్‌రెడ్డికి సీఎంగా ఉద్యోగాలు వచ్చాయని విమర్శించారు. అశోక్‌నగర్‌లో గ్రూప్-1 అభ్యర్థులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జీవో 29తో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు.

### ఆయన మల్‌రెడ్డి కాదు..గోల్‌మాల్ రెడ్డి..

స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆయన మల్‌రెడ్డి కాదని..గోల్ మాల్ రెడ్డి అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పైన రేవంత్‌రెడ్డి ఎట్ల ఉన్నాడో..కింది స్థాయిలో నాయకులూ అలాగే ఉన్నారని ఎద్దేవా చేశారు. ఇక్కడి ఎమ్మెల్యే కూడా మైనింగ్, రైస్‌మిల్లుల నుంచి దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. కొన్ని చిన్న చిన్న తప్పులు చేయడం వల్ల ఇబ్రహీంపట్నంతో సహా అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయామని, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఈ ప్రాంత ప్రజల సంక్షేమానికి పాటుపడ్డారని కొనియాడారు. సబితక్క సైతం స్వార్థం లేకుండా పనిచేశారని.. కలెక్టరేట్, ఫాక్స్‌కాన్ వంటి కంపెనీలను కొం గర కలాన్‌లో ఏర్పాటు చేయించి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారన్నారు. పోలీసులు కేసులు పెడితే బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడొద్దని.. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కేటీఆర్ భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ సమావేశంలో పిక్ పాకెట్, చైన్ స్నాచర్స్ ఉన్నారని, వేదికపై ఉన్న నాయకులకు స్థానిక పోలీసులు సమాచారం ఇవ్వగా.. కేటీఆర్ తనదైన శైలిలో స్పందించారు. పిక్ పాకెట్, చైన్ స్నాచర్స్ బీఆర్ఎస్ మీటింగుల్లో ఉండదని, కాంగ్రెస్ మీటింగుల్లో ఉంటుందని చురక అంటించారు. ఇటీవల జరిగిన ఏ బీఆర్ఎస్ సమావేశాల్లోనూ ఇంతమంది పోలీసులను చూడలేదన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు క్యామ మల్లేశ్, రాష్ట్ర యువ నాయకుడు ప్రశాంత్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వంగేటి లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ కృపేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, మొద్దు అంజిరెడ్డి, జేపీ శ్రీనివాస్, ఆకుల యాదగిరి, మండలపార్టీ అధ్యక్షులు బుగ్గరాములు, రమేశ్‌గౌడ్, రమేశ్, కిష్‌గౌడ్, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు అల్వాల వెంకట్‌రెడ్డి, కొప్పు జంగయ్య, ప్రధాన కార్యదర్శులు బహదూర్, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్‌రావు, బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జెర్కోని రాజు, బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్, నాయకులు శివసాయి, ప్రసాద్‌గౌడ్, ప్రవీణ్‌నాయక్, కొండ్రు ప్రవీణ్, దేవేందర్‌గౌడ్, గరిగె శేఖర్‌గౌడ్, కాజు, జానీపాషా, కరుణాకర్, గణేశ్, బల్వంత్‌రెడ్డి, జంగయ్య ముదిరాజ్, అరవిందర్, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

4లో..











IRA RESTAURANT
Srinivasa Colony, Himayath Nagar, Moinabad
8121998111, 8121834111
Space Sponsored by

